ద్వైతం

– భావన

రెండు రోజులుగా మోహనకి మనసు మనసులో లేదు. రవికి అమెరికాలో ఉద్యోగం వచ్చిందన్న వార్త విన్న క్షణం నుంచీ మోహన మదిలో అన్నీ ఆలోచనలే. రవి ఎంత సంతోషంగా చెప్పాడో ఆ వార్తను. అతనిలో అంతగా హుషారు తెప్పించిన ఆ వార్త, తనకెందుకో అంతగా రుచించలేదు. ఇంకొక నెలలో ఇద్దరూ వివాహం చేసుకోవాలనుకున్నారు. రెండు సంవత్సరాలుగా ఇద్దరూ ఈ సమయం ఎప్పుడొస్తుందా అని ఎదురు చూస్తున్నారు. ఇంతలో, పిడుగులాంటి ఈ వార్త. తను ముందు నుంచి హెచ్చరిస్తూనే ఉంది - తనకి అమెరికా ప్రయాణం ఇష్టం లేదని. రవి మాత్రం ఆ రోజు వచ్చినప్పుడు ఆలోచిద్దాంలే అంటూ ఆ విషయాన్ని దాటేస్తూ వచ్చాడు. తనూ అనవసరంగా రవితో వాదించడం ఇష్టం లేక, ఆ మాటే మరిచిపోయింది. ఇప్పుడింక తప్పదు కాబట్టి, రవితో ఈ రోజే మాట్లాడి ఇద్దరూ ఒక నిర్ణయానికి రావాలి. చివరి పీరియడ్ మొదలయ్యే వేళయింది కాబోలు, వాచిమేన్ గంట వినబడింది. పుస్తకాలు తీసుకొని మోహన క్లాసురూం వైపు నడిచింది. మోహనకి పాతిక సంవత్సరాలుంటాయేమో! వెలుగు చుక్కల్లాంటి కళ్ళు, అందమైన ముక్కు, చూడ చక్కని పలువరసలతో, ఎప్పుడూ కళకళలాడుతూ ఉండే మనోహరమైన రూపం మోహనది. లోని ఆత్మస్థైర్యాన్ని బయటి ప్రపంచానికి సూచిస్తోందా అన్నట్లుంటుంది ఆమె నడక. తెలుగు విశ్వవిద్యాలయంలో ఎం.ఎ దాకా చదివినా, కావాలని రామకృష్ణా మిషన్ వారి స్కూల్లో టీచరుగానే చేరింది. మోహనకి ఆ మఠంలోని నిర్మల వాతావరణమంటే ఎంతో ఇష్టం. అక్కడి పిల్లలకి తనకిష్టమైన తెలుగు పద్యాలు చెప్తూ, వారి అమాయక హృదయాలలోకి తొంగి చూడగలిగే తన అదృష్టానికి మోహన ఎప్పుడూ పొంగిపోతూ ఉంటుంది. ఆ స్కూల్లోని పిల్లలందరూ నా అన్న వాళ్ళు లేని అభాగ్యులే. వారినందరినీ చేరదీసి అక్కడ చదువు సంధ్యలు నేర్పించే రామకృష్ణా మఠంలోని సేవాభావమే మోహన జీవితానికీ ఆదర్శమైంది.

రవికి మోహన పరిచయమై మూడు సంవత్సరాలవుతోందేమో. వరంగల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసి రవి అప్పుడే ఉద్యోగంలోకి కాలు పెట్టాడు. రవి కాలనీలోనే మోహన ప్రక్క వాటాలో ఉండేది. అచిరకాలంలో ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. ఇద్దరికీ సంగీతమన్నా, పాత సినిమాలన్నా మక్కువ ఎక్కువ. ఇలా అభిరుచులు కూడా కలవడంతో, వారిద్దరికీ కలిసి సమయం గడిపే అవకాశం ఎక్కువగానే దొరికేది. రవి చాలా చురుకైన వాడు, చాలా ప్రాక్టికల్ గా ఆలోచిస్తాడు గూడా. మధ్య తరగతి కుటుంబంలో పుట్టినా, స్వయంకృషితో సులభంగా పెద్ద చదువులు చదువగలిగాడు. మోహనలోని ఐడియలిజం అతనిని బాగా ఆకర్షించింది. తన కంటే తక్కువ ఆదాయమే ఉన్నా, నమ్మిన సిద్ధాంతాలకి లోపం రాకుండా ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే మోహనను చూస్తే, రవికెందుకో ఎప్పుడూ అసూయగా ఉండేది. మోహనని రవిలోని సంస్కారం ఎంతో ఆకట్టుకుంది. వారి స్నేహం ప్రేమగా మారడానికి ఎంతో కాలం పట్ట లేదు. ఒకరికొకరు పరిచయమై ఏడాదయిందేమో, ఇద్దరూ వివాహం చేసుకోవాలని నిశ్చయానికొచ్చేసరికి. ఈ రోజుల్లో అన్ని ప్రేమ వివాహాలకొచ్చే చిక్కే వీరికీ వచ్చింది. రవి మోహనల కులం ఒకటి కాదు. మోహన తల్లిదండ్రులవి అభ్యుదయ భావాలు కావడంతో, వారి వైపు నుండి ప్రోత్సాహమే లభించింది. రవి ఇంట్లో మాత్రం ఈ సంబంధానికి అయిష్టత వ్యక్తమయింది. తల్లిదండ్రుల అర్థం లేని అభ్యంతరాలకి రవి తల ఒగ్గలేదు. మోహనను వారి అంగీకారం లేకుండానే చేపట్టడానికి నిశ్చయించుకున్నాడు. కాని, మోహన మాత్రం అందుకు ససేమిరా ఒప్పుకోనంటూ రవికి చెప్పింది. “చూడు రవీ! వివాహం అనేది రెండు జీవితాల్ని ముడివేసే అతి ముఖ్యమైన శుభ కార్యం. మనిద్దరి జీవితాలలో ఒక్కసారి మాత్రమే వచ్చే ఆ ఆనందోత్సవం మనల్ని కని పెంచిన తల్లిదండ్రుల జీవితాల్లోకి సంతోషాన్ని తోడ్కొని రావాలే కాని, వారి హృదయాలను గాయపరచకూడదు. ప్రేమించే ఏ హృదయం, ఇంకొకరి ప్రేమని చులకన చేయలేదు. నిజమైన ప్రేమకు ఇవ్వడమే తప్ప

అడగటం తెలియదు. మన హృదయాలలో వెలిగే అనురాగజ్యోతులు నీ తల్లిదండ్రుల సందేహాంధకారాల్ని అతి త్వరలోనే పారద్రోలుతాయని నాకు పూర్తి విశ్వాసముంది. అంతవరకూ, ఓరిమితో నేను వేచి ఉండగలను. మన ప్రేమ మీద నమ్మకంతో, నువ్వూ ఆ శుభగడియ ఆసన్నమయ్యేంతవరకూ ఓపిక పట్టు". తన అమ్మానాన్నల మనసు మారుతుందని నమ్మకం లేకపోయినా, మోహన చెప్పినదానిలో తప్పు లేదనిపించింది రవికి. ఏ తథాస్తు దేవతలో కటాక్షించి, మోహన కోరికే నిజమైతే, అంతకన్నా తనకు కావల్సినదేముంది? ఈ లోపల తన ప్రయత్నాలూ సఫలమై, అమెరికా వెళ్ళే అవకాశం దొరికితే, ఆర్థికంగానూ తను వివాహానికి సిద్ధమయ్యే అవకాశం దొరుకుతుంది. మోహన కిష్టం లేకపోయినా, తను నచ్చచెప్పి మోహననీ తనతో పాటు అమెరికా తీసుకెళ్తే, ఈ కులమహమ్మారి నుంచి దూరంగా వెళ్ళిపోవచ్చును కూడా. అందుకే, మోహన చెప్పిన దారికి అడ్డు చెప్పలేదు రవి.

రవి, మోహనల ప్రయత్నాలు ఈ రెండు సంవత్సరాలలో అంతగా ఫలించలేదు. రవిలో తన తల్లిదండ్రులు అంగీకరిస్తారన్న ఆశ రోజురోజుకీ తగ్గిపోసాగింది. మోహనకి కూడ రవి ప్రయత్నంలో లోపం లేదనిపించింది. అందుకే, ఇంకొక నెలలో ఏ మార్పూ రాకపోతే, వారి ఆశీస్సులు లేకుండానే వివాహం జరగడానికి రవి బలవంతం మీద అంగీకరించింది. ఇంతలోనే, రవికి అమెరికా ఉద్యోగం ఖాయమైనదన్న వార్త వచ్చింది. రవి ఆనందానికి అవధుల్లేవు. కాని, మనసులో ఓ మూల మోహనేమంటుందోనన్న శంక పీడిస్తూనే ఉంది. వీసాకై మద్రాసు కెళ్ళాల్సి రావడంతో, రెండు రోజుల దాకా మోహనను కలిసే వీలు కూడా చిక్కలేదు. ఈ రెండ్రోజులూ, రవిని వేధిస్తున్నదొక్కటే ప్రశ్న - మోహన ఒప్పుకుంటుందా? అసలే మోహన మొండిది. సిద్ధాంతాల కోసం ఎంతటి త్యాగానికైనా ఆలోచించకుండా సిద్ధపడుతుంది. తనకి మోహన తెలిసిన మూడు సంవత్సరాలలో, మొట్టమొదటిసారిగా మోహన దిగి వచ్చింది పెళ్ళి విషయంలోనే. అదీ తను రెండు సంవత్సరాల పాటు విరామం లేకుండా ప్రయత్నిస్తేనే. ఇప్పుడు తను ఎంత నచ్చజెప్పినా, అమెరికా రావడనికి మోహన ఒప్పుకుంటుందా? ఏమో, పెళ్ళి విషయంలో తన ఆదర్శాలు నిజం కాకపోవడంతో, మోహన మారిందేమో! తనకీ ఉద్యోగం చాలా అవసరం. అది లేకపోతే బ్రతుకలేనని కాదు. తన కెరీర్ లో ఇది ఎంతో కావల్సిన మలుపు. అమెరికాలో జరుగుతున్న అత్యంత ఆధునిక సాంకేతికాభివృద్ధిలో పాలుపంచుకునే అవకాశం తనకు మళ్ళీ మళ్ళీ రాదు. అందుకే, మోహనకు నచ్చచెప్పి ఎలాగైనా ఒప్పించాలి. ఇంతలోనే మోహన నుంచి ఫోను వచ్చింది. "రవీ! సాయంత్రం బిర్లా మందిర్ కెళ్దాం. అక్కడే నీ ప్రయాణం గురించి కూడా మాట్లాడుకోవచ్చు. నన్నొచ్చి పికప్ చేసుకుంటావా?" అంటున్న మోహనకు అలాగేనని చెప్పి రవి బయల్దేరాడు.

దర్శనం చేసుకుని ఇద్దరూ గుడిలోంచి బయటకు వచ్చి పాలరాతి మెట్ల మీద దూరంగా ఒక మూల చతికిలబడ్డారు. నిత్య జీవన పోరాటంలో విసిగి వేసారి పోయి ఇళ్ళకి మరలి వెళ్తున్న భాగ్యనగరవాసుల తంటాలు చూసి నవ్వుకుంటూ సూర్య భగవానుడు పశ్చిమాద్రి చేరుకుంటున్నాడు. రాబోయే పున్నమి చంద్రుని కాహ్వానం పలుకుతోంది కాబోలు, చల్లని గాలి మెల్లగా వీస్తూ అందరికీ ఆహ్లాదాన్ని పంచుతోంది. ఆ సమయంలో రెండు హృదయాలు మాత్రం తమ గుంపు నుంచి విడిపోయిన జంట పక్షుల్లా కలవరంతో నిండి నగరంలోని జనసందోహానికి దూరంగా తమ భావిజీవిత మార్గాలు వెతుక్కుంటున్నాయి. ఆ నిశ్శబ్దంలో కలిసి గడిపే రెండు క్షణాలూ, నోరు విప్పితే ఎక్కడ తమ కలయికలో గడిచిన చివరి క్షణాలవుతాయో అన్న భయంతో కాబోలు, రవి మోహనలిద్దరూ సంధ్యాకాశం వైపు చూస్తూ చాలా సేపు మౌనంగా ఉండిపోయారు. గూళ్ళకి చేరుకున్న పక్షుల కిలకిలరావాలు గూడా, వీరిద్దరి మధ్య జరగబోయే సంభాషణ వినడానికా అన్నట్లు క్రమక్రమంగా మూగబోతున్నాయి. ఆ స్తబ్దత లోని తీవ్రతనింక భరించలేకనేమో , మోహన చేతిలో చేయి వేసి రవి తన మనసులోని మాట చెప్పాడు. "మోహనా! నీకు అమెరికా ప్రయాణం ఇష్టం లేదని నాకు తెలుసు. కాని నేను చెప్పబోయేది కూడా నువ్వు విను. ఆ తర్వాత నిర్ణయం నీ ఇష్టం. ఈ ప్రపంచంలో స్వార్థం లేకుండా బ్రతకాలనుకోవడం మంచిదే. కానీ ఆ సిద్ధాంతం కోసం అన్నింటినీ త్యాగం చేయటం తెలివైన పని కాదు. త్యాగం చేయటానికి ఒకవేళ సిద్ధపడినా, అది ఉచితమైనప్పుడే చేయాలి. లేకపోతే, ఇక ఆ త్యాగాలకు విలువేముంది? మన పెళ్ళి

విషయమే తీసుకో. నా ఇంట్లో నీ కులం వేరని మన పెళ్ళి కొప్పుకోకపోతే, నువ్వు వాళ్ళ మనసుల్ని గాయపరచకూడదని మన సుఖాన్ని ఈ రెండేళ్ళ నుంచీ త్యాగం చేశావు. కానీ జరిగిందేమిటి? నీ భావాల్లోని మంచితనం వారి మనసుల్ని జయిస్తుందని ఆశపడ్డావు. కానీ అది నిజంగా జరిగిందా? నువ్వు చేసిన త్యాగం, అపాత్రదానంలా, విలువ లేనిదైపోయింది. వారి కులదురహంకారం పెరిగిందే తప్ప తరగలేదు. అందుకే, ఈ కుళ్ళిపోయిన సమాజం నుంచి దూరంగా వెళ్ళిపోదాం. పరదేశమైనా, అమెరికాలో మన చదువులకీ, సంస్కారాలకీ విలువనిస్తారు. కష్టించి పైకొచ్చిన మనలాంటి వాళ్ళ ప్రతిభను, శ్రమను గుర్తించే సంఘం అది. ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచి, వైజ్ఞానికంగా అనుదినమూ క్రొత్త పుంతలు త్రొక్కుతున్న దేశమది. అలాంటి వాతావరణంలో, లోని ప్రతిభను పూర్తిగా వినియోగించుకునే అవకాశం ఏ క్రొద్దిమందికో తప్ప రాదు. ఆ సువర్ణావకాశం దొరికినా చేజార్చుకోవడం తెలివి కాదు. ఎంత మంది భారతీయులు ఆ దేశంలో స్థిరపడి, మొత్తం ప్రపంచానికే ఎనలేని సేవ చేయడంలేదు? వారిలో ఎంతమంది అక్కడ గడించిన సంపదను తమ మాతృదేశాభివృద్ధికై వెచ్చించడంలేదు? అందుకే చెప్తున్నాను, ఏ విధంగా చూసినా, అమెరికా ప్రయాణం మంచిదని. నా మాట కాదనకు మోహనా!" అంటున్న రవిని చూసి మోహన తెల్లబోయింది. అయినా, తనకు రవిని జడ్జి చేసే అధికారం లేదు. ఎవరి అభిప్రాయాలు వారివి. తన మనసులోని మాట నిర్మొహమాటంగా, నిజాయితీగా చెప్పాడు. అదే పని తను చేయడంలో తప్పు లేదు కదా! అందుకే, మృదువుగా రవి చేతిలోంచి తన చేతిని విడిపించుకొని చెప్పింది. "రవీ! తన వారి కోసం ప్రేమతో చేసే ఏ త్యాగం వ్యర్థం కాదు. అసలు నేనది ఒక త్యాగమని కూడా అనుకోను. ఈ దేశం మనది. ఈనాడు మన సంఘం ఇంత దుస్థితిలో ఉండడానికి కారణం మనమందరమూనూ. ఈ పరిస్థితిని చక్కదిద్దే బాధ్యత ఏ ఒక్కరిదో కాదు, మనందరిదీ. ఒక గాంధీ మహాత్ముడే తన సత్యాగ్రహంతో ఈ దేశానికి స్వాతంత్ర్యం తీసుకురాలేదు. ఆయన ఎన్నుకున్న బాటలోని ఔన్నత్యాన్ని గ్రహించి, కోట్లానుకోట్లుగా భారతీయులు ఆయన వెంట నడిచారు కాబట్టే, మనమీనాడు స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్నాం. మార్పు అనేది ఏ ఒక్క రోజే, ఏ ఒక్క వ్యక్తి వలనో రాదు రవీ! అది మన హృదయాలలో అంకురించి, మన చర్యల ద్వారా అందరి హృదయాలలోకి చొరబడిన రోజే నిజమైన మార్పు సంభవిస్తుంది. నువ్వన్నావే! అమెరికా ప్రపంచంలోకెల్లా అగ్రగామని. ఆ దేశం అంత ఉన్నత స్థాయికి ఎలా ఎదిగిందో నీకు తెలియదా? మనం వారంతటి పురోగతిని ఎందుకు సాధించలేం? వారి పౌరుల్లో ఒక్కరు ఆపదలో పడినా, వారు ఎంత గొడవైనా చేసి అతన్ని కాపాడుతారే. మన దేశంలో కోట్లమంది తినడానికి గంజి కూడా లేక అలమటిస్తుంటే, మనకి చీమ కుట్టినంతైనా బాధ ఉందా? నువ్వు ఎన్నుకున్న మార్గం, ఈ ప్రశ్నలన్నింటినుంచీ పారిపోవడమే. ఆ పని నేను చేయలేను. నువ్వు ప్రేమించే వారికి రేపేదైనా అయిందనుకో, వారి ఖర్మకి వారినొదిలేసి వెళ్తావా? కంటికి రెప్ప వాలకుండా, వారికి సపర్యలు చేయవా? వారి ఆరోగ్యం కోసం ఈ భూమండలంలో సాధ్యమైనదేమైనాసరే, ప్రయత్నించి చూడవా? అలాగే, ఎప్పుడైతే ఈ దేశం నాది అనుకుంటావో, అప్పుడు సాటి మానవుల సౌభాగ్యం కోసం నువ్వు చేసే ఏ పనీ త్యాగం అనుకోవు. ఇవన్నీ నీకు ప్రాక్టికల్ అనిపించకపోవచ్చు. మోహన పిచ్చిది, దేశం కోసం ఏదో చేసేద్దామని పిచ్చిగా కలలు కంటూ తన జీవితాన్నే త్యాగం చేస్తోంది అని నువ్వనుకున్నా పర్వాలేదు. ఎందుకంటే, నువ్వు నా ప్రాణమైనా, మన ప్రేమ నాకు ఒక బంధనం కాదు. అది నా జీవన పోరాటంలో నన్నత్యున్నత శిఖరాల వైపు నడిపే సజీవ శక్తి. నేను ఆ ప్రేమకు ద్రోహం చేయలేను, నా మనసుని నేను మోసగించలేను. ఇది నీ మీద తీర్పు కాదు రవీ! నేను నీకంటే వయసులోనూ, అనుభవంలోనూ చిన్నదాన్ని. నీ నిర్ణయాలు తప్పని కాని, ఒప్పని కాని చెప్పే అర్హత నాకు లేదు. నీ జీవితాన్ని నేను చెప్పినట్లే మలుచుకోమని నేననడం లేదు. కానీ, నా జీవితంలో నేనెంచుకున్న మార్గం నుంచి నన్ను విడదీయ వద్దంటున్నాను. నేను చెప్పినదాన్ని గురించి కూడా నువ్వాలోచించు. నీకు నా మార్గంలో నమ్మకం లేకపోతే, నువ్వమెరికా నిరభ్యంతరంగా వెళ్ళు. నువ్వు తిరిగి వచ్చే రోజు కోసం నేను వేచి ఉంటాను. మనం ఈ రెండు సంవత్సరాలలో వివాహంతో ఒకటి కాలేక పోయినా, మన మనస్సుల్లో ఎప్పుడూ ఒక్కటిగానే బ్రతికాం. ఇక ముందు కూడా, భౌతికంగా మనం ఒక్క చోట లేకపోయినా, మన హృదయాలు ఎప్పటికీ ఒక్కటిగానే ఉంటాయి.

నువ్వు నన్నర్థం చేసుకోగలవన్న నమ్మకం నాకుంది" అంటూ లేచి నిల్చుని, చేయందించి రవిని కూడా లేపింది. మోహన సంగతి తెలిసిన రవి మారు మాట్లాడలేదు. ఆ వెన్నల రాత్రిలో, ఇద్దరూ నెమ్మదిగా మెట్లు దిగి ఇంటి దారి పట్టారు.

మోహన ఊహించినట్లే, రవి తన అభిప్రాయం మార్చుకోలేదు. ఆ మరునాడు ఉదయాన్నే స్కూలుకి ఫోను చేసి చెప్పాడు. "మోహనా! మనమెప్పుడూ ఒకరినొకరం అర్థం చేసుకున్నాం. అందుకే, నా నిర్ణయం ఏమిటో నీకీపాటికి తెలిసే ఉంటుంది. నేనెల్లుండి ఫ్లైట్లో బయల్దేరుతున్నాను. మళ్ళీ వెనక్కెప్పుడు వస్తానో చెప్పలేను. కాని, ఒక్కటి మాత్రం నిజం. నా జీవితాశయం పూర్తయిన మరుక్షణం, రెక్కలు కట్టుకుని నీ దగ్గర వాల్తాను. అప్పటిదాకా నీ జ్ఞాపకమే నన్ననుక్షణం వెంటాడుతుంటుంది. ఇంక ఉంటాను. బెస్ట్ ఆఫ్ లక్. నా ఉత్తరాలకి జవాబిస్తావు కదూ!" అంటున్న రవిని విష్ చేసి, బరువైన హృదయంతో క్లాస్లోకి నడిచింది మోహన. ఆ రోజు పిల్లలకి తనకెంతో ఇష్టమైన ఒక కరుణశ్రీ పద్యం నేర్పింది.

ప్రేమసి ప్రేమలోన గనిపించెడి తీయని స్వర్గమొక్కటే
ధ్యేయముగాదు - హీనులతిదీనులు మ్లానతనుల్ దరిద్ర నా
రాయణులేడ్చుచుండిరి; తదశ్రువులన్ తుడువంగబొమ్ము నీ
ప్రేమసితోడ నీకటు లభించును కోట్లకొలంది స్వర్గముల్.